సాక్షి
అనంతపురం
శనివారం । 3 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.



రెండింతల వాన

దేశంలోనే అత్యల్పంగా వర్షపాతం నమోదయ్యే అనంతపురం జిల్లాలో ఈ ఏడాది కరువు తీరా వర్షం కురిసింది. 8లో



జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ప్రజలందరికీ సచివాలయ సేవలు అందాలి



సిబ్బందికి సూచనలిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: సచివాలయ సేవలు ప్రజలందరికీ అందించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సూచించారు. కళ్యాణదుర్గం మండలం నారాయణపురం సచివాలయాన్ని శుక్రవారం మంత్రి తనిఖీ చేశారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని, సచివాలయ సేవలను మరింత విస్తృత పరచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలోని డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేత గాజుల ప్రభాకర్ కుమారుడి వివాహ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు.

12 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్/బుక్కరాయసముద్రం: ముంగారు తొలకర్లు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 12 మండలాల పరిధిలో 6.9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. డి.హీరేహాళ్‌లో 69.8 మి.మీ., గార్లదిన్నెలో 68.6 మి.మీ భారీ వర్షం కురిసింది. బ్రహ్మసముద్రం 15.2, రాయదుర్గం 14.2, యాడికి 10.2 మి.మీతో పాటు కణేకల్లు, బెళుగుప్ప, శింగనమల, గుత్తి, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, రాప్తాడు తదితర మండలాల్లో వర్షపాతం నమోదైంది. కాగా ఈనెల 5 నుంచి 7వ తేదీ మధ్య తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.

ప్రశాంతంగా 'పది' సప్లిమెంటరీ పరీక్షలు



రాప్తాడురూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు తెలుగు, ఉర్దూ, సంస్కృతం, కన్నడ పరీక్షలకు 3,987 మంది విద్యార్థులకు గాను 2,842 మంది హాజరయ్యారు. 1,145 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

నేటి నుంచి గ్రూప్‌-1 మెయిన్స్‌ పరీక్షలు



కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో గ్రూప్–1 సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలు శనివారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు జరగనున్నాయని కలెక్టర్ గౌతమి శుక్రవారం తెలిపారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు 522 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులను ఉదయం 8.30 గంటల నుంచి 9.45 గంటలలోపు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరవ్వాలన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలపై కసరత్తు



రాప్తాడు రూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో కీలకమైన ఖాళీలపై విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి గురువారం రాత్రి 11 గంటల సమయానికి పూర్తి చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 731 అభ్యంతరాలు వచ్చాయి. వాటన్నింటినీ పరిశీలించి అర్హత ఉన్నవారికి పాయింట్లను కేటాయించి జాబితాలో చేర్చారు. విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచే అన్ని జిల్లాల ప్రొవిజనల్ సీనియార్టీ తుది జాబితాలను శనివారం ప్రకటించాల్సి ఉంది. ఖాళీలకు సంబంధించి ఈ ఏడాది మే 31 వరకు ఉన్న ఖాళీలన్నీ వెబ్‌సైట్‌లో పొందు పరుస్తున్నారు. శుక్రవారం రాత్రికి అన్ని కేడర్లకు సంబంధించి దాదాపు 4,400 ఖాళీలు అప్‌లోడ్ చేశారు. మరో 300 దాకా పెరిగే అవకాశం ఉంది.

రైతు సంక్షేమానికి పెద్దపీట

- వైఎస్సార్ యంత్రసేవ కింద రూ.23.15 కోట్లతో ట్రాక్టర్లు, పరికరాలు
- 230 సీహెచ్‌సీ రైతుగ్రూపులకు రూ.8.15 కోట్ల రాయితీ చెక్కు విడుదల
- 'మెగామేళా'కు భారీగా హాజరైన రైతులు
- ఇది రైతు ప్రభుత్వం : జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి
- ఆర్‌బీకే వ్యవస్థతో విప్లవాత్మక మార్పులకు నాంది
- రైతులకు ఇతోధికంగా సర్కారు సాయం



రైతులకు పంపిణీ చేసిన వ్యవసాయ ట్రాక్టర్లు

అనంతపురం అగ్రికల్చర్: దేశంలోనే ప్రప్రథమంగా రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) వ్యవస్థతో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాంది పలికారు. నాలుగేళ్లుగా అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు, మందులను ఆర్బీకే వేదికగా అందుబాటులోకి తీసుకురావడం, పెట్టుబడులకు ఇబ్బంది కలగకుండా రైతుభరోసా సొమ్ముతో సాయం అందించడం, పంట సాగు మొదలు విక్రయం వరకు అడుగడుగునా అండగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో రైతుల కోసం ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు సబ్సిడీపై అందించేందుకు శుక్రవారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎదురుగానున్న మైదానంలో జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్ అధ్యక్షతన మెగా మేళా నిర్వహించారు. వైఎస్సార్ యంత్ర సేవ పథకంలో భాగంగా జిల్లాలోని 230 రైతుమిత్ర గ్రూపులకు కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ) కింద మంజూరైన రూ.23.15 కోట్ల విలువ చేసే 169 ట్రాక్టర్లు, 1,161 ఆధునిక సేద్యపు పరికరాలు, మొదటి సారిగా మంజూరు చేసిన మూడు కంబైన్డ్ హార్వెస్టర్లను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఇందులో రైతుగ్రూపులకు ప్రభుత్వం వర్తింపజేసిన రూ.8.15 కోట్ల రాయితీని మెగా చెక్కు రూపంలో అందించారు. అనంతరం నగరంలో ట్రాక్టర్లతో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు.

రైతు ప్రభుత్వం

తమది రైతు ప్రభుత్వమని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పంట రుణాల సున్నావడ్డీ, రైతుభరోసా, రాయితీ విత్తనాలు, ఎరువులు, యంత్ర సేవ, సూక్ష్మసేద్యం, ప్రయోగశాలలు, 1962 వెటర్నరీ అంబులెన్సులు, 108, 104 సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆసరా, చేయూత, చేదోడు, విద్యాదీవెన, వసతి దీవెన.. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక పథకాలు, కార్యక్రమాలతో రైతు కుటుంబాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తున్న గొప్ప ప్రభుత్వమన్నారు. అనంతరం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్ లిఖిత, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు ఆలమూరు సుబ్బారెడ్డి, రైతుమిత్ర గ్రూపు సభ్యులు భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, పెద్దిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ బోర్డు మెంబర్ గద్దె కేశవరెడ్డి, ఉద్యానశాఖ డీడీ రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ జి.ఫిరోజ్‌ఖాన్, తహసీల్దార్ శ్రీధర్, డీసీసీబీ జీఎం కె.సురేఖారాణి, ఏడీఏ ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.





వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద ట్రాక్టర్ల పంపిణీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మెగా మేళాకు హాజరైన రైతులు

'అనంత'ను కోనసీమగా మారుద్దాం

రాష్ట్ర ప్రభుత్వం రైతులు, మహిళలు, పేద వర్గాల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని కలెక్టర్ గౌతమి అన్నారు. గతంలో వేరుశనగ పంపిణీ అంటే రైతులు క్యూ లైన్లలో పడిన అవస్థలు కళ్లారా చూశామన్నారు. అప్పట్లో అదొక శాంతిభద్రతల సమస్యగా ఉండేదన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి ఎక్కడా లేదన్నారు. రైతును రాజుగా చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా రైతు ముంగిటకే ఆర్‌బీకేల ద్వారా అన్ని సేవలూ అందిస్తోందన్నారు. ఈ–క్రాప్ ఆధారంగా అర్హత కలిగిన ప్రతి రైతుకూ ప్రయోజనాలతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ కొనుగోళ్లు, సున్నావడ్డీ లాంటి పథకాలు పారదర్శకంగా నేరుగా రైతుకే అందిస్తున్నట్లు వివరించారు. అంతర్జాతీయ మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించిన నేపథ్యంలో ఈ ఏడాది జిల్లాలో చిరుధాన్యపు పంటల సాగుకు రైతులు ముందుకు వస్తే గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తామని తెలిపారు. వైవిధ్యంగా, ప్రయోగాత్మకంగా అనేక రకాలైన వాణిజ్య, ఉద్యాన పంటలు సాగు చేస్తూ కరువుసీమ 'అనంత'ను కోనసీమగా మార్చుకుందామని పిలుపునిచ్చారు.

డ్రైల్యాండ్ హార్టికల్చర్‌కు అనుమతుల మంజూరు

- 5వేల ఎకరాల్లో పండ్ల మొక్కల సాగు లక్ష్యం



డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి

అనంతపురం టౌన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకాని (డ్రైల్యాండ్ హార్టికల్చర్)కి పరిపాలన అనుమతులు మంజూరైనట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉపాధి హామీ ఏపీడీ, ఏపీఓలతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 5వేల ఎకరాల్లో పండ్ల మొక్కలను సాగు చేయాలని ఈ ఏడాది లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. పండ్ల మొక్కల గ్రౌండింగ్ పనులను వేగవంతంగా చేపట్టే దిశగా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. పండ్ల మొక్కల సాగు కోసం దరఖాస్తు చేసుకున్న రైతులతో సమావేశాలు నిర్వహించి.. వారికి ఆసక్తి ఉన్న పండ్ల మొక్కల ఎంపిక ప్రక్రియను చేపట్టాలన్నారు. నెలాఖరులోపు రైతుల పొలాల్లో గుంతలు తవ్వే ప్రక్రియను పూర్తి చేసి మొక్కలు నాటేందుకు సిద్ధం చేయలన్నారు. వర్షాకాలం పూర్తయ్యేలోపు 100 శాతం మొక్కలు నాటే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

పాఠశాలల్లో మొక్కల పెంపకం

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లో మొక్కలు నాటేందుకు సన్నద్ధం కావాలని డ్వామా పీడీ సూచించారు. పాఠశాలల పునః ప్రారంభం కాగానే ఒక్కో విద్యార్థి ఒక మొక్క చొప్పున నాటించి వాటిని సంరక్షించే బాధ్యతలను కమిటీ సభ్యుల చేత చేపట్టే దిశగ చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు కోసం గ్రామాల్లోని క్షేత్రసహాయకులు, మేట్లు ప్రత్యేక కార్యాచరణ చేపట్టే ఉపాధిహామీ సిబ్బంది మొక్కల పెంపకంపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.

దోచిపెట్టేందుకు 'పచ్చ'పాతం

- ఆర్‌అండ్‌బీలో అవినీతి జలగ
- టీడీపీ నేత తమ్ముడికి జీహుజూర్
- కాసులకు కక్కుర్తి పడి సింగిల్ బిడ్డర్‌కే గ్రీన్ సిగ్నల్
- రివర్స్ టెండరింగ్ లేకుండానే అగ్రిమెంటు పూర్తి
- ప్రభుత్వానికి భారీగా నష్టం



ఆర్‌అండ్‌బీ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రోడ్లు భవనాల శాఖలో భారీగా అవినీతి జరిగింది. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై భారీ స్కామ్‌కు తెరలేపారు. నిబంధనలకు విరుద్ధంగా సింగిల్ టెండర్‌కు ఓకే చేసి కాంట్రాక్టర్‌కు మేలు చేశారు. కాసుల కోసం లాలూచీ పడి ఖజానాకు చిల్లు పెట్టారు.

టీడీపీ నేతతో కుమ్మక్కు

టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ తమ్ముడు మడకశిరలో కాంట్రాక్టరు. ఈయన కోసం ఆర్‌అండ్‌బీ పెద్దలు సాగిలపడ్డారు. ఇటీవలే మడకశిర నియోజక వర్గంలో పరిగి–యు రంగాపురం, అమరాపురం–మధూడి, మధూడి–గాయత్రి కాలనీలో రోడ్డుపనులకు టెండర్లు పిలిచారు. ఈ మూడు వర్కులకు సంబంధించిన పనుల విలువ రూ.6.45 కోట్లుపైనే. సాధారణంగా ఏదైనా పనికి సింగిల్ టెండరు వస్తే వీటిని మళ్లీ టెండరుకు పిలవాలి. కానీ ఇలా చేయకుండా నేరుగా ఇచ్చారు. డీఈలు ఇచ్చిన ఎస్టిమేషన్‌లు (అంచనాలు) కనీసం సమీక్షించలేదు. పైగా అంచనాలు భారీగా పెంచేసి వర్కులు వచ్చారు. ఈ తతంగంలో ఆర్‌అండ్‌బీలో ఉన్నతాధికారి ఒకరు కీలకంగా వ్యవహరించి కాంట్రాక్టరుకు లబ్ధి చేకూర్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రివర్స్ టెండర్‌కు మంగళం

ఏదైనా ఒక పనికి సింగిల్ టెండర్ దాఖలైతే నిబంధనల ప్రకారం రెండో కాల్‌కు వెళ్లాలి. రెండో కాల్‌కూడా రానప్పుడు మూడో కాల్‌లో ఫైనల్ చేయాలి. ఇవేవీ లేకుండా సింగిల్ టెండర్‌కే అధికారులు పనులు అప్పగించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా 80 శాతం, 20 శాతం స్టేట్‌బ్యాంక్ నిధులతో నిర్మించాల్సిన ఈ రోడ్లలో భారీగా కమీషన్లు ముట్టినట్టు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితమే ఈ వర్కులకు సంబంధించి కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. ఇందులోనూ మతలబు చేశారు. ఈ పనులన్నీ ఒకే వర్క్ కింద చూపితే పెద్ద కాంట్రాక్టర్లు వస్తారన్న ఉద్దేశంతో ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారి మెలిక పెట్టారు. దీంతో టీడీపీ నేత తమ్ముడికి లబ్ధికలిగేలా ఈ పనులను ముక్కలుగా చేసి ఇచ్చారు. సదరు ఉన్నతాధికారి గతంలో నేషనల్ హైవేస్‌లో పనిచేసినప్పుడు కూడా భారీగా అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలున్నాయి.

వర్కుల వివరాలు ఇవే

కేటగిరీ	ప్రాంతం	పని విలువ
ప్రత్యేక మరమ్మతులు	పరిగి-యు.రంగాపురం	రూ.2.35 కోట్లు
ప్రత్యేక మరమ్మతులు	అమరాపురం-మధూడి	రూ.2.15 కోట్లు
ప్రత్యేక మరమ్మతులు	మధూడి-గాయత్రి కాలని	రూ.2.04 కోట్లు

అది నా దగ్గర శాంక్షన్ కాలేదు

సంవత్సరం క్రితం కొన్ని పనులకు అనుమతులిచ్చాం. తాజాగా నేను ఏ పనికీ అనుమతి ఇవ్వలేదు. సింగిల్ టెండర్ వస్తే రెండో టెండర్‌కు వెళ్లాల్సిందే. దీనిపై పూర్తి సమాచారం నాకు తెలియదు. ఒక్కసారి పరిశీలన చేస్తా. మడకశిరలో కాంట్రాక్టర్లు సరిగా ముందుకు రాని మాట వాస్తవమే.

–నయీముల్లా, ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ

బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని లేఖ రాశా

టీడీపీ మాజీ ఎమ్మెల్సీ తమ్ముడు అధికారులతో కుమ్మక్కై టెండర్లు వేస్తాడు. అగ్రిమెంట్లు చేసుకున్న తర్వాత పనులు చేయకుండా వదిలేస్తాడు. అందుకే అతన్ని బ్లాక్‌లిస్టులో పెట్టాలని సీఎంకు లేఖ రాశా. ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీని కలిసి చెప్పా. అయినా ఆ కంపెనీని అధికారులు బ్లాక్‌లిస్ట్‌లో ఉంచలేదు. మడకశిర నియోజకవర్గంలో చాలా వర్కులు పెండింగ్‌లో ఉంచడం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. కాంట్రాక్టర్‌ను మార్చాలని చెబితే... మరో సంస్థ పేరుమీద టెండరు వేసి పని అతనికే అప్పగించారు. దీనివెనుక భారీగా సొమ్ములు మారినట్టు నా దృష్టికి వచ్చింది.

–తిప్పేస్వామి, శాసనసభ్యులు, మడకశిర

గైనిక్ సేవలపై ఎన్‌ఎంసీ సంతృప్తి



గైనిక్ విభాగంలో వైద్యులతో మాట్లాడుతున్న ఎన్‌ఎంసీ సభ్యురాలు డాక్టర్ ప్రీతి

అనంతపురం క్రైం: బోధనాస్పత్రి (అనంతపురం సర్వజనాస్పత్రి)లోని గైనిక్ సేవలపై నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) సంతృప్తి వ్యక్తం చేసింది. శుక్రవారం గైనిక్ విభాగంలో 12 పీజీ సీట్ల గుర్తింపునకు సంబంధించి ఎన్‌ఎంసీ సభ్యురాలు గుజరాత్ జామ్‌నగర్‌లోని షా వైద్య కళాశాల గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రీతి శుక్రవారం బోధనాస్పత్రిలో పర్యటించారు. లేబర్, ఆంటినేటల్, గైనిక్ యూనిట్లను పరిశీలించారు. రోజూ ఓపీ 150కుపైగా ఉంటుందని, సగటున 28 ప్రసవాలు జరుగుతున్నాయని గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం ఎన్‌ఎంసీ సభ్యురాలికి వివరించారు. యూనిట్లలో 115 శాతం గర్భిణి, బాలింతలు ఉన్నట్లు ఆమె నమోదు చేశారు. అనంతరం ఓపీ, ఐపీ, తదితర సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు సకాలంలో రక్తం అందుతోందా? రక్త నిధి సామర్థ్యం తదితర వివరాలను బ్లడ్ బ్యాంకు వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. గైనిక్ ఓపీలు, మెయిన్ ఆపరేషన్ థియేటర్, ఎమర్జెన్సీ ఓటీ, సెంట్రల్ ల్యాబ్, ఎమర్జెన్సీ, ఏఎంసీ, తదితర విభాగాలను పరిశీలించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవితో సమావేశమయ్యారు. వైద్య కళాశాలలో వివిధ ల్యాబ్‌లను ఆమె పరిశీలించారు. అనంతరం గైనిక్ విభాగం వైద్యుల హెడ్ కౌంట్ చేశారు. ఎన్‌ఎంసీ సభ్యురాలు ప్రొఫెసర్లు డాక్టర్ సంధ్య, సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'జన్ భాగిదారి' నిర్వహించాలి

రాప్తాడు రూరల్: 'నిపుణ్ భారత్'లో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 22 వరకు 'జన్ భాగిదారి' కార్యక్రమం చేపట్టాలని డీఈఓ, సమగ్ర డీపీసీ ఎం.సాయిరామ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రీ ప్రైమరీ నుంచి 3వ తరగతి పిల్లలు పాఠశాల స్థాయిలో ఆరు రకాల కార్యక్రమాల (రంగోలి, పద్యపఠనం, క్విజ్, చిత్రలేఖనం, కథలు చెప్పడం, వక్తృత్వ పోటీలు)లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచి నైపుణ్యాలు కనబరచిన పిల్లలను, వారి తల్లిదండ్రులను జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. మండల విద్యాశాఖ అధికారులు, సిబ్బంది వారి పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని సూచించారు. బోధనాభ్యసన సామగ్రిని పాఠశాలల్లో ప్రదర్శించి.. అత్యుత్తమ ప్రదర్శనలను జిల్లా స్థాయి మేళాకు ఎంపిక చేయాలని ఎంఈఓలను ఆదేశించారు.

'నాడు-నేడు' స్కూళ్లలో డిజిటల్ బోధన

- ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు
- 6–10 తరగతులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లతో బోధన
- ప్రైమరీ స్కూళ్లలోనూ స్మార్ట్ టీవీలతో తరగతులు
- తొలి విడతగా 534 స్కూళ్లలో అమలు



బండ్లపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో డిజిటల్ బోధన

రాప్తాడురూరల్: ప్రభుత్వ స్కూళ్లల్లో అత్యున్నతస్థాయి బోధనతో విద్యార్థులను ప్రపంచస్థాయి పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం డిజిటల్ విద్యకు శ్రీకారం చుట్టింది. ఆధునిక సాంకేతిక పరికాలను ఉపయోగించడం ద్వారా బోధనలో విప్లవాత్మక చర్యలను చేపట్టింది. ఇందులో భాగంగా 2023–24 విద్యా సంవత్సరంలో డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు ఉపక్రమించింది. ప్రభుత్వ బడుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీ), ప్రాథమిక పాఠశాలలకు స్మార్ట్ టీవీలను సరఫరా చేస్తున్నారు. తొలివిడత 'నాడు-నేడు' కింద అభివృద్ధి చేసిన 534 స్కూళ్లలో 1,595 ఐఎఫ్ ప్యానళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచంలోని పెద్దపెద్ద కార్పొరేట్ పాఠశాలల్లో ఉండే అత్యంత విలువైన, నాణ్యత కల్గిన ఐఎఫ్‌పీలను ఏపీ ప్రభుత్వం అతి సాధారణమైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందుబాటులో తెచ్చింది. జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఇప్పటికే 4-జీ ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లను బ్లాక్, వైట్ బోర్డుల్లా వినియోగించుకోవచ్చు. బోర్డుపై రాసిన నోట్స్‌ను సేవ్ చేసుకోవచ్చు. ఇంటర్నెట్ సదుపాయం ఉండడంతో కంప్యూటర్‌లా కూడా వాడుకోవచ్చు. యూట్యూబ్‌ను చూడొచ్చు. సెల్‌ఫోన్, ట్యాబ్‌లో ఉన్న మెటీరియల్‌ను ఈ స్క్రీన్‌పై చూపించవచ్చు. మొత్తం మీద తరగతి గదిలోనే విద్యార్థులకు ప్రపంచం చూడొచ్చని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఐఎఫ్‌పీ, స్మార్ట్‌టీవీలు అందుబాటులోకి తెస్తారు.

ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు

ప్రాథమిక పాఠశాలల్లోని 1–5 తరగతులు, ఉన్నత పాఠశాలల్లోని ప్రాథమిక తరగతుల విద్యార్థులకు స్మార్ట్‌టీవీల ద్వారా తరగతులు బోధించనున్నారు. ప్రతి 60 మంది పిల్లలకు ఒక స్మార్ట్ టీవీ ఏర్పాటు చేయనున్నారు. తొలివిడతగా 534 స్కూళ్లలో 759 స్మార్ట్‌టీవీలు ఏర్పాటు చేయనున్నారు. ఐఎఫ్ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీల ఏర్పాటుకు అవసరమైన వైరింగ్, తదితర మెటీరియల్‌ను సమగ్రశిక్ష నిధులతో కొనుగోలు చేసేలా ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రపంచస్థాయి బోధన

డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థులకు ప్రపంచస్థాయి బోధన అందుతుంది. రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికతను అందిపుచ్చుకుని డిజిటల్ బోధనకు శ్రీకారం చుడుతోంది. భవిష్యత్తులో మంచి ఫలితాలు ఉంటాయి. టీచర్లు కూడా అదే స్ఫూర్తితో బోధన చేయాలి.

– ఎం.సాయిరామ్, డీఈఓ

280 మందికి ఉద్యోగాలు



అపాయింట్‌మెంట్ లెటర్లను చూపుతున్న అభ్యర్థులు

ఉరవకొండ: పట్టణంలోని మహాత్మా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి జాబ్ మేళా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 692 మంది నిరుద్యోగులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. అందులో 280 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించడంతో పాటు అపాయింట్‌మెంట్ లెటర్లను కూడా ఇచ్చినట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ ఎల్.ఆనందరాజు తెలిపారు.

రెండింతల వాన

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు కొలువుదీరిన నాటి నుంచి ప్రకృతి సహకరిస్తుండటంతో 'అనంత 'లో కరువుతీరేలా వర్షాలు పడుతున్నాయి. గత నాలుగేళ్లుగా వద్దన్నా వర్షాలు కురుస్తున్నాయి. ముగిసిన వాటర్ ఇయర్‌లో రెండింతల వర్షపాతం నమోదైంది.



భారీ వర్షానికి పొంగిపొర్లుతున్న వాగు (ఫైల్)

- జిల్లాలో సాధారణ వర్షపాతం 512.5 మి.మీ, కురిసింది 766 మి.మీ
- సాధారణం కన్నా 50 శాతం అధికంగా నమోదు
- కీలకమైన ఖరీఫ్‌లో 450 మి.మీ వర్షంతో 40.5 శాతం అధికం

2022-23లో వర్షపాత వివరాలు

నెల	సాధారణం(మి.మీ)	కురిసింది (మి.మీ)	తక్కువ/ఎక్కువ
జూన్ 2022	61.0	82.5	35.2 శాతం అధికం
జూలై ..	63.9	61.8	3.3 శాతం తక్కువ
ఆగస్టు ..	83.8	186.2	122.2 శాతం అధికం
సెప్టెంబర్ ..	110.9	118.8	7.1శాతం అధికం
అక్టోబర్ ..	100.9	143.3	42 శాతం అధికం
నవంబర్ ..	28.6	22.3	22 శాతం తక్కువ
డిసెంబర్ ..	9.8	33.2	238.8 శాతంఅధికం
జనవరి 2023	1.8	0.1	94.4 శాతం తక్కువ
ఫిబ్రవరి..	0.8	0.0	100 శాతం తక్కువ
మార్చి ..	2.1	13.5	542.9 శాతం అధికం
ఏప్రిల్ ..	12.1	30.2	149.6 శాతం అధికం
మే ..	36.7	74.2	102.4 శాతం అధికం
మొత్తం ఏడాదిలో	512.4	766.1	49.5 శాతం అధికం

అనంతపురం అగ్రికల్చర్: ఏటా జూన్ ఒకటి నుంచి మే 31 వరకు వర్షపు సంవత్సరం (వాటర్ ఇయర్) గా పరిగణిస్తారు. ఉమ్మడి జిల్లాలో ఏటా సాధారణ వర్షపాతం 552.3 మి.మీగా ఉండేది. గతేడాది జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో రెండు జిల్లాలుగా ఏర్పాటయ్యాయి. ఈ క్రమంలో అనంతపురం జిల్లా సాధారణ వర్షపాతం 512.4 మి.మీగా గుర్తించారు. దేశంలోనే రాజస్థాన్‌లోని జైసల్మీర్ తర్వాత రెండో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే జిల్లాగా అనంతపురం కొనసాగుతోంది. ఇలాంటి అత్యల్ప వర్షపాతంగా రికార్డుల్లో ఉన్న జిల్లాలో ఇటీవల కాలంలో అధిక వర్షాలు కురుస్తుండటం విశేషం. ప్రధానంగా జూన్ నుంచి అక్టోబర్ 15 వరకు నైరుతి రుతు పవనాలు, ఆ తర్వాత ఈశాన్య రుతు పవనాలు ప్రభావం చూపిస్తుండటంతో వర్షాలకు కొదవ లేకుండా పోయింది. జూన్ 1 నుంచే ఈ వర్షపాత సంవత్సరం కూడా ఆశాజనకంగా మొదలైంది. జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ తొలకర్లు పలకరిస్తుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా అంతటా జలకళ

2022 జూన్ 1 నుంచి 2023 మే 31 వరకు సాధారణం కన్నా ఏకంగా 49.5 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. 512.4 మి.మీ గాను 766.1 మి.మీ భారీ వర్షపాతం కురిసింది. కొన్ని మండలాల్లో కుంభవృష్టి, కుండపోత వాన పడింది. వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు నిరంతరం ప్రవహించాయి. చిత్రావతి, పెన్నా లాంటి నదీపరివాహక ప్రాంతాలు ప్రవహించడంతో రిజర్వాయర్లు, చెరువులు కూడా నిండటంతో జిల్లా అంతటా జలకళ ఉట్టిపడుతోంది. ప్రధానంగా కీలకమైన జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్‌లో 'నైరుతి' ప్రభావంతో 319.6 మి.మీ సాధారణం కన్నా 40 శాతం అధికంగా 449.2 మి.మీ మేర వర్షాలు పడటంతో 4.04 లక్షల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చాయి. ఖరీఫ్ నాలుగు నెలల కాలంలో 33 రోజులు, రబీ, వేసవికి సంబంధించి 8 నెలల కాలంలో 28 రోజులు వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి. రోజులో సగటున 2.5 మి.మీ నమోదైతే రెయినీడేగా పరిగణిస్తారు. రైతులు, కూలీలకు ఏడాది పొడవునా చేతినిండా సేద్యపు పనులు ఉండటంతో వలసలు అనే పదానికి పూర్తిగా చెక్‌పడింది. గత నాలుగేళ్లుగా సాధారణం కన్నా అధికంగానే వర్షాలు పడుతున్నాయి.

27 మండలాల్లో అధికం

జిల్లాలో ఉన్న 31 మండలాలకుగాను 27 మండలాల్లో సాధారణం కన్నా అధిక వర్షాలు కురిశాయి. గుత్తి, యాడికి, తాడిపత్రి, యల్లనూరులో సాధారణం నమోదు కాగా మినహా మిగతా మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. ఎక్కడా లోటు వర్షపాతం లేకపోవడం విశేషం. గతంలో చాలా సార్లు అత్యంత అల్పవర్షపాతం నమోదైన కూడేరు, ఆత్మకూరులోనే ఈ సారి అత్యధిక వర్షాలు పడటం గమనార్హం. ఈ రెండు మండలాల్లో సాధారణం కన్నా ఏకంగా 165 శాతం అధికంగా నమోదైంది. ఆత్మకూరు సాధారణం 340.9 మి.మీ కాగా 879.7 మి.మీ, కూడేరు సాధారణం 346.6 మి.మీ కాగా ఏకంగా 905.6 మి.మీ నమోదైంది. ఆ తర్వాత పామిడి, కుందుర్పి, రాయదుర్గం, బొమ్మనహాల్, డీ.హీరేహాళ్, గుమ్మఘట్ట, కంబదూరు, గార్లదిన్నె, కళ్యాణదుర్గం, పెద్దవడుగూరు తదితర మండలాల్లో మంచి వర్షాలు కురిశాయి.

పెళ్లి మండపంలో భారీ చోరీ

- రూ.7.50 లక్షలతో పాటు బంగారం మాయం
- లబోదిబోమంటున్న ఆడబిడ్డ తల్లిదండ్రులు



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆడబిడ్డ పెళ్లికి ఖర్చు చేయాల్సిన సొత్తును దొంగ దోచుకెళ్లిన ఘటన అనంతపురం నగర శివారులోని నీలం రాజశేఖరరెడ్డి కల్యాణ మండపంలో గురువారం చోటు చేసుకుంది. నాల్గవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాప్తాడుకు చెందిన బిళ్లేనారాయణస్వామి కుమార్తెని, వేపకుంటకు చెందిన సోమన్న కుమారుడు (ప్రస్తుతం తిరుమలలో వైద్యుడు)కి ఇచ్చి వివాహం చేయాలని ఇరు కుటుంబాల పెద్దలు నిర్ణయించారు. ఇందులో భాగంగా అనంతపురం శివారులోని నీలంరాజశేఖరరెడ్డి కల్యాణ మండపంలో మే 31 ముహూర్తం కాగా 1న తలంబ్రాలు జరిగాయి. గురువారం పెళ్లి వేడుకకు హాజరైన బంధువులు, మిత్రులు నూతన వధువరులకు తెచ్చిన బహుమతులను వధువు తల్లిదండ్రులు ఓ గదిలోకి సర్దుతున్నారు. ఈ సమయంలో బిళ్లే నారాయణస్వామి తన చేతిలో ఉన్న రూ.7.50 లక్షలతో పాటు రెండు తులాల బంగారు నగలున్న బ్యాగును వారికి కేటాయించిన సేఫ్టీ గదిలో దాచారు. అదే గదిలో వధువుకు వచ్చిన గిఫ్ట్‌లను ఓ పక్కకు సర్దారు. తీరా డబ్బున్న బ్యాగు వైపు చూడగా అది కనిపించలేదు. దీంతో అనుమానం వచ్చి కల్యాణ మండపం మొత్తం గాలించారు. గుర్తుతెలియని ఓ వ్యక్తి ఆ గది లోంచి బయటకు వచ్చినట్లు తోటి వారు చెప్పడంతో తెలుసుకున్న బాధితులు విషయాన్ని నాల్గవ పట్టణ పోలీసులకు తెలిపారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించే పనిలో పడ్డారు. కాగా ఓ వ్యక్తి మండపం నుంచి బయటకు వెళ్లడం కనిపించింది. అతనే దొంగా? కాదా? అన్నది తెలియాల్సి ఉంది. పెళ్లికి ఖర్చు పెట్టాలనుకున్న డబ్బు మాయం కావడంతో బాధిత కుటుంబ సభ్యులు ఇబ్బంది పడ్డారు.

దొంగల జాబితాతో..

కల్యాణ మండపాల్లో చోరీలకు పాల్పడే దొంగల జాబితాను వెలికి తీసిన పోలీసులు దొంగను పట్టుకునేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. గతంలో ఇలాంటి నేరాలతో సంబంధాలున్న వారిని స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. కల్యాణ మండపంలో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తి ఫొటోను సేకరించారు. ఈ ఫొటో ఆధారంగా దొంగ కోసం గాలిస్తున్నారు.

ఆటో ఢీకొని బాలుడి మృతి





కన్నీరు మున్నీరవుతున్న బాలుడి తల్లి, కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) మృతుడు షాన్వాజ్

గుంతకల్లు రూరల్: మండల పరిధిలోని నెలగొండ గ్రామంలో శుక్రవారం ఆటో ఢీ కొనడంతో షాన్వాజ్ (4) అనే బాలుడు మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. నెలగొండ గ్రామానికి చెందిన రుక్మాన్ బాషా, ఖాదర్‌బీ దంపతుల కూతురు అయిన మున్నీని 13 సంవత్సరాల క్రితం గుంతకల్లు మండలంలోని నరసాపురంకు చెందిన దస్తగిరి బాషా అనే వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు కూతుళ్లు , కుమారుడు షాన్వాజ్ (4) సంతానం. మున్నీ పుట్టినిళ్లు అయిన నెలగొండలో మూడు రోజులుగా నూతనంగా నిర్మించిన వీరాంజనేయ ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగానే మున్నీ కూడా తన పుట్టినింటికి వెళ్లింది. అయితే శుక్రవారం మధ్యాహ్నం ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు షాన్వాజ్ ఉన్నట్టుండి రోడ్డుపైకి వెళ్లాడు. అదేసమయంలో అటు నుంచి వేగంగా వచ్చిన ఆటో బాలుడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన షాన్వాజ్‌ను కుటుంబ సభ్యులు వెంటనే గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో బాలుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల కన్నీరు మున్నీరయ్యారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఆహార కల్తీని అరికట్టండి

- విస్తృతంగా తనిఖీ చేయాలని జేసీ కేతన్‌గార్గ్ ఆదేశం

అనంతపురం అర్బన్: ఆహార కల్తీని అరికట్టేలా విస్తృత తనిఖీలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వినియోగదారుల హక్కులు, సమస్య పరిష్కారం అంశంపై జేసీ శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ ఆహార కల్తీ అధిగా జరుగుతోందని, ఆకస్మిక దాడులు నిర్వహించి తనఖీలు చేపట్టాలన్ని ఆదేశించారు. ఆహార కల్తీపై డీసీఐసీ సభ్యులు సదస్సులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వినియోగదారులకు ఉన్న హక్కులు, వినియోదారుల రక్షణ చట్టం-2019 గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వస్తువు కొనుగోలు సమయంలో వినియోదారులను ఎలా మోసగిస్తారనే విషయాలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. వినియోగదారుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు పరిష్కార వేదికలను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించాలన్నారు. పాఠశాలు, కళాశాలల్లో వినియోదారుల క్లబ్‌లు ఏరాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తూనికలు కొలతలు, వైద్యారోగ్య, ఆహార కల్తీ నియంత్రణ, అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జేఎల్‌ఎం మృతి



మృతుడు కుమార్ రాజ

గుంతకల్లు రూరల్: విద్యుత్ మరమ్మత్తు చేస్తూ ఇండక్షన్ షాక్‌కు గురై గ్రేడ్ టు జేఎల్‌ఎం కుమార్ రాజ (45) మృతిచెందిన ఘటన శుక్రవారం గుంతకల్లు పట్టణంలోని అశోక్‌నగర్‌లో చోటుచేసుకుంది. సహచర ఉద్యోగుల వివరాల మేరకు.. పట్టణంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన మునయ్య, రత్నమ్మ దంపతుల కుమారుడు కుమార్ రాజ విద్యుత్‌శాఖలో గ్రేడ్‌టు జేఎల్‌ఎంగా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని అశోక్ నగర్ కాలనీకి తోటి ఉద్యోగులతో కలిసి మరమ్మతు చేపట్టేందుకు వెళ్లాడు. విద్యుత్ పోల్ పైకి ఎక్కి మరమ్మతు చేస్తున్నారు. అయితే గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఇండక్షన్ షాక్‌కు గురవడంతో కుమార్ రాజ పై నుంచి కింద పడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ బాధ్యతల దృష్ట్యా కుమార్ రాజ ఇప్పటి వరకు పెళ్లి కూడా చేసుకోలేదని తోటి ఉద్యోగులు తెలిపారు. కసాపురం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నేకొత్తపల్లిలో మరొకరు...



మృతుడు అమర్‌నాథ్

చెన్నేకొత్తపల్లి: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని గంగినేపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల మేరకు.. గంగినేపల్లికి చెందిన అమరనాథ్ (37) నూతనంగా ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇంటికి నీరు పెట్టేందుకుగాను వాడుతున్న మోటర్‌కు కనెక్షన్ ఇచ్చే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ మేనిఫెస్టో టిష్యూ పేపర్ లాంటిది



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

గుత్తి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మహానాడులో విడుదల చేసిన మేనిఫెస్టో టిష్యూ పేపర్ లాంటిది.. దాన్ని ప్రజలు ఎవరూ నమ్మరని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ఆయన ఎంపీపీ విశాలాక్షి, మార్కెట్ యార్డు చైర్మన్ సునీలా యాదవ్, మాజీ చైర్మన్ మల్లయ్యయాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు 2014లో 650 హామీలతో మ్యానిఫెస్టో ప్రకటించారని, అయితే అందులో కనీసం పది శాతం హామీలను కూడా అమలు చేయలేదన్నారు. ఇంటికో ఉద్యోగం, రైతు , డ్వాక్రా రుణ మాఫీ వంటి హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. ఇంటికో ఉద్యోగం అని తన కొడుకు పప్పు (లోకేష్)కు మాత్రమే ఉద్యోగం ఇచ్చాడన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం, సీఎంగా వైఎస్ జగన్ రెండోసారి ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమన్నారు.

డెంగీతో ఇద్దరు విద్యార్థుల మృతి





మృతుడు ప్రవీణ్‌కుమార్, వన్నూరుస్వామి (ఫైల్)

శింగనమల: జిల్లాలో ఇద్దరు విద్యార్థులు డెంగీ జ్వరంతో మృతి చెందారు. శింగనమల మండలంలోని లోలూరు గ్రామంలో డెంగీ జ్వరంతో బాధపడుతూ వడ్డే ప్రవీణ్‌కుమార్ (7) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. స్థానికుల వివరాలమేరకు... లోలూరుకు చెందిన వడ్డే రాజు, మేఘన దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు ప్రవీణ్‌కుమార్ స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. ఐదురోజుల క్రితం జ్వరం బారిన పడటంతో చుట్టు పక్కల ఉన్న ఆస్పత్రుల్లో చూపించారు. కాగా శుక్రవారం ఉదయం బాలుడి పరిస్థితి విషమించడంతో అనంతపురం సర్వజనాస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ ప్రవీణ్‌కుమార్ మృతి చెందాడు.

వారం రోజులుగా జ్వరాలు

లోలూరు గ్రామంలో వారం రోజుల నుంచి చిన్నారులు, ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. శుక్రవారం మహమ్మద్ వయాజ్ అనే బాలుడికి అధిక జ్వరం రావడంతో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. గ్రామంలో జ్వరాలు అధికంగా ఉన్నాయని, వైద్యులు వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

బొమ్మనహాళ్‌లో మరొకరు..

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో డెంగీ జ్వరంతో వన్నూరుస్వామి (13) అనే విద్యార్థి శుక్రవారం మృతి చెందారు. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. శ్రీధరఘట్టకు చెందిన ఈరమ్మ, ధనుంజయ దంపతుల కుమారుడు వన్నూరుస్వామి (13) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుండేవాడు. వేసవి సెలవులు కావడంతో కర్ణాటకలోని బళ్లారి జిల్లా కోళగల్లులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి గత నాలుగురోజుల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. ఆ తరువాత తీవ్రమైన జ్వరం రావడంతో కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు డెంగీగా నిర్ధారించి రెండురోజులుగా చికిత్స అందిస్తున్నారు. అయితే శుక్రవారం ఉదయం పరిస్థితి విషమించడంతో వన్నూరుస్వామి మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని 6వ రోడ్డులో నివాసం ఉంటున్న షేక్ శర్మాస్ వలి (37) శుక్రవారం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసున్నారు. తాపీ మేస్త్రీగా పనిచేసే షేక్ శర్మాస్ వలి గుండెజబ్బు కారణంగా స్టంట్ వేయించుకున్నాడు. అనారోగ్యం క్షీణించడంతో మనస్థాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'అనంత' తపాలా ఎస్పీగా హరిబాబు

అనంతపురం సిటీ: అనంతపురం తపాలా శాఖ రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా హరిబాబు వందనను నియమించారు. ఈ మేరకు ఆ శాఖ కర్నూలు పీఎంజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహారాష్ట్ర నుంచి నలుగురు సూపరింటెండెంట్లను కర్నూలు రీజియన్‌కు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు వారందరికీ డివిజన్లు కేటాయించారు.

క్లుప్తంగా

ఆత్మకూరు తహసీల్దార్‌గా షర్మిల


తహసీల్దార్ షర్మిల

ఆత్మకూరు: ఆత్మకూరు నూతన తహసీల్దార్‌గా షర్మిల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దపప్పూరు తహసీల్దార్‌గా పనిచేసిన ఆమెను ఆత్మకూరు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఈవోఆర్డీగా దామోదర్‌రెడ్డి.. ఆత్మకూరు మండల నూతన ఈవోఆర్డీగా దామోదర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఆత్మకూరులో పని చేసిన ఈవోఆర్డీ సత్యబాబు విడపనకల్లుకు బదిలీపై వెళ్లగా, ఉరవకొండలో పని చేస్తున్న దామోదర్‌రెడ్డిని ఆత్మకూరు ఈవోఆర్డీగా నియమించారు.

వన్‌టౌన్ సీఐగా రెడ్డెప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: వన్‌టౌన్ సీఐగా రెడ్డెప్ప శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి, జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావును కలిసి పుష్పగుచ్ఛం అందించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు.

టీటీడీ ఆధ్వర్యంలో సత్యదేవుడి వ్రతాలు

అనంతపురం కల్చరల్: హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ఉచిత సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేపడుతున్నట్లు టీటీడీ పండిట్ వేణు తెలిపారు. నగరంలోని ఉమానగర్‌లో కొలువైన ప్రాచీన దత్తాత్రేయస్వామి ఆలయంలో ఈనెల 4న ఉదయం 9 గంటలకు సామూహిక సత్యదేవుడి వ్రతాలు జరుగుతాయన్నారు. తనకల్లు మండలం దిగువతొట్టి మండలంలోని కోదండరామాలయంలో అదే రోజు సామూహిక వ్రతాలు జరుగుతాయన్నారు.

అర్హులందరికీ పింఛన్లు పంపిణీ


దయాలసిస్ బాధితుడికి పింఛన్ అందిస్తున్న ఎంపీడీఓ సాల్మన్

రాప్తాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ సాల్మన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని లింగనపల్లిలో డయాలసిస్‌తో బాధపడుతున్న చుక్కలూరు మల్లికార్జున రెడ్డికి ఎంపీడీఓ సాల్మన్ పింఛన్ పంపిణీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మూడు నెలల నుంచి మల్లికార్జున రెడ్డి డయాలసిస్‌తో బాధపడుతున్నాడన్నారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవడంతో ప్రభుత్వం నుంచి మంజూరైందన్నారు. పంచాయతీ కార్యదర్శి రామచంద్రా రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ తనుజా, ఏఎన్ఎం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలికి కూలిన విద్యుత్ స్తంభాలు

అనంతపురం టౌన్: జిల్లాలో గురువారం రాత్రి ఈదురుగాలికి విద్యుత్ స్తంభాలు కూలినట్లు ఆశాఖ ఎస్ఈ సురేంద్ర తెలిపారు. దీంతో రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గం కనేకల్లు మండలం, విడపనకల్లు, ఉరవకొండ మండలాల్లో ఎక్కువ శాతం 40కిపైగా విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు తెలిపారు. వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు.

పనిచేసే చోట పింఛన్ అందజేత


పింఛన్ అందిస్తున్న వలంటీర్

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన బానిసల నాగమ్మ బెళుగుప్ప మండలం కాలువపల్లి ఏరు వద్దకు దుస్తులు ఉతకడానికి వెళ్లింది. ఆమె మూడురోజుల పాటు ఆత్మకూరుకు రాదని తెలిసి, గ్రామ వలంటీర్ అశోక్‌కుమార్‌రెడ్డి శుక్రవారం కాలువపల్లికి వెళ్లి పింఛన్ అందించాడు.

భూముల మార్కెట్ విలువ తగ్గించాలి

అనంతపురం టౌన్: పెంచిన భూముల మార్కెట్ విలువను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం డాక్యుమెంట్ రైటర్లతో కలిసి స్థిరాస్తి వ్యాపారులు రామ్‌నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. స్థిరాస్తి వ్యాపారులు మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఒకేసారి 100శాతం పెంచడం ఏమిటని ప్రశ్నించారు. పెంచిన భూముల మార్కెట్ విలువ తగ్గించే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణంకు అందజేశారు.

32 గొర్రెల మృతి

రాప్తాడురూరల్: పంటకు పిచికారీ చేసే డ్రిప్ మందు కలిపిన నీటిని తాగి 32 గొర్రెలు మృతి చెందిన ఘటన రూరల్ మండలం కందుకూరులో శుక్రవారం జరిగింది. వివరాలు.. సాకే పోతులయ్య పొట్టేళ్లను పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం గ్రామానికి చెందిన రైతు ఆకులేటి వెంకటరాముడు పొలం సమీపంలోకి మేతకు తీసుకెళ్లాడు. అక్కడ వెంకటరాముడు తోటలోని నీటి తొట్టిలో యూరియా కలిపిన నీరు ఉండగా, ఆ నీటిని పొట్టేళ్లు తాగాయి. కాసేపటికే పొట్టేళ్లు మృతి చెందాయి. రూ. లక్ష నష్టపోయినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

విద్యుత్ లోఓల్టేజీ సమస్యలకు చెక్

- కొడిమి, ఉప్పరపల్లికి సబ్‌స్టేషన్లు మంజూరు
- ఆలమూరుకు మరో సబ్ స్టేషన్‌కు ప్రతిపాదనలు
- రూ.5 కోట్లతో పనులకు శ్రీకారం



అనంతపురం టౌన్: విద్యుత్ సంస్థ లోఓల్టేజీ సమస్యలకు చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టింది. రూరల్ మండల పరిధిలోని గ్రామాలు నగరానికి సమీపంలో ఉండడంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. నగరం చుట్టూ నివాస గృహాల నిర్మాణాల సంఖ్య పెరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్‌శాఖ అధికారులు లోఓల్టేజీ సమస్య రాకుండా ముందస్తుగా సబ్ స్టేషన్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. కొడిమి, ఉప్పరపల్లికి సబ్ స్టేషన్లతోపాటు ఆలమూరుకు మరో సబ్ స్టేషన్ మంజూరుకు ప్రతిపాదనలు పంపారు. రూ.5 కోట్లతో పనులు చేపట్టనున్నారు. రూరల్ మండల వ్యాప్తంగా 50 వేలకు పైగా నివాస గృహాలు ఉన్నాయి. దీంతోపాటు వ్యవసాయ భూములు, తోటలు అధికంగా ఉన్నాయి. అక్కడక్కడ విద్యుత్ లోఓల్టేజీ సమస్య ఉండడంతో అధికార యంత్రాంగం లోఓల్టేజీ సమస్యకు చెక్ పెట్టేందుకు కసరత్తు ప్రారంభించారు. అందులో భాగంగానే మూడు సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. రూరల్ మండలంలోని కొడిమి, ఉప్పరపల్లి గ్రామాలకు విద్యుత్ అధికారులు రెండు సబ్ స్టేషన్లు మంజూరు చేశారు. ఇప్పటికే ఈ రెండు ప్రాంతాల్లో స్థల సేకరణ పూర్తయ్యింది. కొడిమి గ్రామ పంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లోని ఓపెన్ సైట్‌లో, ఉప్పరపల్లి గ్రామ శివారులో మరో సబ్ స్టేషన్‌ను నిర్మించనున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా రూ.5 కోట్ల మేర నిధులు మంజూరు చేశారు. రూరల్ మండలంలో నాలుగు సబ్ స్టేషన్లు రాచానపల్లి, కక్కలపల్లి, ఇటుకులపల్లి, తాటిచెర్ల గ్రామాల పరిధిలో సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటితోపాటు కొత్తగా మంజూరైన ఈ రెండు సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు పూర్తయితే విద్యుత్ సమస్యలు ఉండవు. ఆలమూరు గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు విద్యుత్ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం ఆలమూరు శివారులోని ఎర్రకొండలోని జగనన్న లేఅవుట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ ఏకంగా 20 వేల ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ఇక్కడ విద్యుత్ సమస్యలకు తావులేకుండా ముందస్తుగానే సబ్ స్టేషన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. స్థలంకూడా అందుబాటులో ఉండడంతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. అక్కడి నుంచి అనుమతి ఉత్తర్వులు రాగానే నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

వారంలో నిర్మాణ పనులు

రూరల్ మండలంలో రెండు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి రూ.5 కోట్ల మేర నిధులను మంజూరు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే కొడిమి, ఉప్పరపల్లి గ్రామాల్లో స్థలాన్ని గుర్తించారు. ఈనెల 10వ తేదీలోపు రెండు సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను చేపట్టేందుకు ఇప్పటికే కాంట్రాక్టర్లకు ఆదేశాలను జారీ చేశాం. సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు పూర్తయితే రూరల్ మండలంలో ఎక్కడా విద్యుత్ లోఓల్టేజీ సమస్యలు ఉండదు.

– రమేష్, విద్యుత్ శాఖ ఈఈ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సీజనల్ వ్యాధులపై ఇస్తున్న జిల్లా వైద్యాధికారి వీరబ్బాయి

- జిల్లా వైద్యాధికారి వీరబ్బాయి

ఆత్మకూరు: ఆరోగ్య విషయాలపై నిర్లక్ష్యం చేయరాదని, అప్రమత్తతతోనే సీజనల్ వ్యాధులను కట్టడి చేయొచ్చని జిల్లా వైద్యాధికారి వీరబ్బాయి ప్రజలకు సూచించారు. శుక్రవారం మలేరియా మాసోత్సవాల్లో భాగంగా పంపనూరు తండాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలియజేశారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, ఎలా వ్యాపిస్తాయి? వాటి నివారణ చర్యల మార్గాలను ప్రజలకు తెలియజేశారు. ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచరాదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా అధికారి ఓబులు, ఉప మలేరియా అధికారి సత్యనారాయణ, వైద్యాధికారి దయాకర్, ఎంపీహెచ్ఓలు నాగేశ్వరయ్య, మునాఫ్, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


రాప్తాడులో సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఆత్మకూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు, రైతులు

రాప్తాడు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రైతులకు ఎల్ల వేళలా రైతులకు అండగా ఉంటోందన్నారు. వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఎన్నికల హామీ మేరకు ఏటా రూ.13,500 రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నామన్నారు. పంటలు నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. రైతులు పండించిన పంటలను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల ఫెడరేషన్ జిల్లా చైర్మన్ పసుపుల నరసింహగౌడ్, మరూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండారెడ్డి, అగ్రిబోర్డ్ చైర్మన్ కేశవరెడ్డి, అనంతపురం రూరల్ మండల కన్వీనర్లు గోవింద్‌రెడ్డి, బండి పవన్ కుమార్, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, చిట్రా వెంకటేష్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు నరసింహ రెడ్డి, మాచిరెడ్డి చెన్నారెడ్డి, బండి శ్రీనివాసులు, గొర్ల సుదర్శన్ రెడ్డి, కొండా రెడ్డి, చిన్న ఓబి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇది రైతుల ప్రభుత్వం

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రైతుల ప్రభుత్వం కొనసాగుతోందని ఎంపీపీ సుబ్బర హేమలత తెలిపారు. శుక్రవారం రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సహాయం కింద రైతులకు రూ.7,500 నగదు రైతుల ఖాతాలకు జమ చేసిన సందర్భంగా మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బాలపోతన్న, సర్పంచ్‌లు వరలక్ష్మి, ఎర్రిస్వామి, వైస్ ఎంపీపీలు విజయ్, నీలిమ, ఎంపీటీసీ సభ్యులు ఓబులేసు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు తైదుల శివారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, అంజినప్ప, సురేష్, బాబయ్య, వెంకటేష్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటాలి


సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో ఆర్డీటీ గ్రాస్‌రూట్ కోఆర్డినేటర్ ఓబులేసు, సాఫ్ట్‌బాల్ సీఈఓ వెంకటేశులు

అనంతపురం: తైవాన్‌లో జూన్ 13 నుంచి 17 వరకు జరిగే అండర్–15 ఏసియా ఉమెన్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటాలని ఆర్డీటీ గ్రాస్ రూట్ కోఆర్డినేటర్ ఓబులేసు అన్నారు. ఇందులో పాల్గొనున్న సాఫ్ట్‌బాల్ మహిళల జట్టు కోచింగ్ క్యాంప్ శుక్రవారం ముగింపు సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్డీటీ క్రీడా గ్రామంలో ఈ క్యాంప్ నిర్వహించారు. అనంతరం సాఫ్ట్‌బాల్ సీఈఓ వెంకటేశులు మాట్లాడుతూ అండర్–15 మహిళల ఎంపిక ప్రక్రియ ఏప్రిల్ 8,9 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించినట్లు తెలిపారు. తైవాన్ దేశంలో తైపే, పూలి నగరాల్లో జరిగే పోటీల్లో పాల్గొనే జట్టు వివరాలు..

అండర్–15 భారత సాఫ్ట్‌బాల్ మహిళల జట్టు: సౌమ్య రాణి, సౌందర్య, సాత్విక, సరయు, కార్తిక, తులసి, శ్రావిక (తెలంగాణ), స్మైలీ, కీర్తన (ఆంధ్రప్రదేశ్), కామిని, జెన్నీఫర్ (తమిళనాడు), హెలెన్, మెరిన్ (కేరళ), కావేరి, ప్రిన్సి(మహారాష్ట్ర), శృతి(ఢిల్లీ), కోచ్ ఎల్. విజయకుమార్ (కర్ణాటక)

వైఎస్సార్ సీపీలో చేరిన బాకే హబీబుల్లా


ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరిన బాకే హబీబుల్లా

అనంతపురం క్రైం: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బాకే హబీబుల్లా వైఎస్సార్ సీపీలోకి చేరారు. శుక్రవారం స్థానిక నివాసంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి బాకే హబీబుల్లాకు కండువా వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతోనే నియోజకవర్గం అభివృద్ధి జరుగుతోందన్నారు. పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. బాకే హబీబుల్లా మాట్లాడుతూ అనంతపురం నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఎమ్మెల్యే అనంత ప్రత్యేక చొరవతో రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు తాను వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, కార్పొరేటర్లు అబూసాలేహా, ముంతాజ్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా

- నగరపాలక సంస్థ మేయర్ వసీం


పీఏబీఆర్‌లో కమిషనర్ రమణారెడ్డికి సూచనలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని నగరపాలక సంస్థ పాలకవర్గం తీసుకున్న ముందు చూపు నిర్ణయంతో అంతరాయం లేకుండా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు మేయర్ వసీం తెలిపారు. పీఏబీఆర్ పంపింగ్ కేంద్రంలో హై ఓల్టేజీతో రెండో మోటార్ చెడిపోవడంతో కమిషనర్ రమణారెడ్డితో కలసి మేయర్ డ్యాంను శుక్రవారం పరిశీలించారు. అదనపు మోటార్ ద్వారా నీరు పంపింగ్ చేస్తున్నట్లు అధికారులు మేయర్‌కు తెలిపారు. నీటి సరఫరా కేంద్రాల్లో ఎస్ఈ, ఈఈ, డీఈల నిరంతర పర్యవేక్షణ తప్పక ఉండాలని మేయర్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం రెండు మోటార్లు మాత్రమే ఉండడంతో ఒక మోటరు చెడిపోతే నగరానికి తాగునీటి సరఫరా నిలిచిపోయేదన్నారు. రూ.80 లక్షలతో అదనపు మోటారు కొనుగోలు చేసినట్లు తెలిపారు. అవసరమైతే మరో మోటార్‌ను కొనుగోలు చేసి మొత్తం నాలుగు మోటార్లను అందుబాటులోకి తెస్తామన్నారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, కార్పొరేటర్ అనిల్ కుమార్ రెడ్డి, ఈఈ చంద్రశేఖర్, ఏఈ సాయి, నాయకులు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధి:

అందరి సహకారంతోనే రోడ్ల అభివృద్ధి సాధ్యమవుతుందని మేయర్ వసీం తెలిపారు. 38వ డివిజన్‌లోని కోవూర్‌నగర్‌లో రోడ్డు సర్వేను మేయర్ పరిశీలించారు. సర్వేలో మూడు అడుగులు దాటి రోడ్డుపై వచ్చి బండలు పాతినట్లు తేలడంతో వాటిని తొలగించాలని సంబంధిత వ్యక్తులకు మేయర్ సూచించారు. డీఈ రాంప్రసాద్ రెడ్డి, సర్వేయర్ ప్రభాకర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ఓటరుకార్డులు పరిశీలించండి

- డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి

ఆత్మకూరు: ప్రతి ఇంటికీ తిరిగి ఓటరు కార్డులను పరిశీలించాలని డీఆర్‌డీఏ పీడీ (నోడల్ అధికారి) నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌తో కలసి బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన వారి కార్డులో ఏవైనా తప్పులు ఉన్నాయా ? లేదా అని తెలుసుకోవాలన్నారు. ఎవరైనా మరణించి ఉంటే వారి ఓటును తొలగించాలన్నారు. ఒకే వ్యక్తికి సంబంధించి రెండు ఓట్లు ఉన్నా వాటిని పరిశీలించి, ఒక ఓటును తొలగించాలన్నారు. అర్హులైన యువతీయువకులు ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి బీఎల్‌ఓ తప్పనిసరిగా ప్రతి ఇంటికీ తిరిగి ఓటు కార్డులను పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిల , ఎంపీడీఓ విజయ్ ప్రసాద్, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాసవీమాత ఆలయంలో హోమాలు


అలంకరణలో వాసవీమాత


హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: స్థానిక వాసవీమాత ఆలయంలో స్వర్ణోత్సవం సందర్భంగా మహా కుంభాభిషేకం కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల హోమాలు నిర్వహించారు. ఉదయాన్నే ప్రాతఃకాల పూజతో పాటు దేవతా హోమం, సుదర్శన హోమం, చండీ హోమం, ధాన్యాదివాసం, రుద్రహోమం, నవగ్రహ హోమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ప్రదోష పూజ, దీక్షాహోమం, సుదర్శన హోమం, శాంతి పౌష్టిక హోమం, అదివాస హోమం హోమాలు చేశారు. అమ్మవారిని పూలతో అలంకరించారు.

ఛీటింగ్ కేసులో ముగ్గురికి రిమాండ్

రాప్తాడురూరల్: ప్లాటు కొనుగోలు విషయంలో చీటింగ్ చేసిన కేసులో అనంతపురం రూరల్ పోలీసులు శుక్రవారం ముగ్గురి నిందితులను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు. పోలీసులు తెలిపిన మేరకు.. నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి సయ్యద్ మసూద్‌వలి 1987లో తన భార్య పేరున ఎ.నారాయణపురం పొలం 160 సర్వే నంబరులో 5.50 సెంట్లు కొనుగోలు చేశాడు. 2022 జూన్ 3న ఈ ప్లాటు ఇతరులకు విక్రయించాడు. కొనుగోలు చేసిన వారు సదరు ప్లాటులోకి వెళ్లి క్లీన్ చేస్తుండగా తాడిపత్రి సుబహాన్, అల్లీపీరా అనే వ్యక్తులు గతంలోనే తాము ఈ స్థలం కొనుగోలు చేశామని అడ్డుపడ్డారు. వారివద్ద ఉన్న డాక్యుమెంట్లను పరిశీలిస్తే...తాడిపత్రి వన్నూర్‌బీకి జీపీఏ చేసినట్లు ఉంది. దీనిపై అప్పట్లో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా సయ్యద్ మసూద్‌వలి భార్య ఫొటోను మార్ఫింగ్ చేసి, ఆధార్‌కార్డును మార్ఫింగ్ చేసి వన్నూర్‌బీకి విక్రయించినట్లు విచారణలో తేలింది. ఈ కేసులో వన్నూర్‌బీతో పాటు సుబహాన్, అల్లీపీరాను అప్పట్లోనే అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపారు. మరింత లోతుగా విచారణ చేసిన పోలీసులకు మసూద్‌వలి భార్య పేరున రికార్డులను ఫోర్జరీ చేసి విక్రయించడంలో అనంతపురం నగరానికి చెందిన ఎస్.మసూద్ అహ్మద్ బాషా, షఫీ అహ్మద్, గుంతకల్లుకు చెందిన వై.షెక్షావలి ప్రధాన పాత్ర పోషించారని విచారణలో తేలడంతో ఈ ముగ్గురిని అరెస్ట్ చేశారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

అనంతపురం క్రైం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వివిధ విభాగాల్లోని వైద్యులు, స్టాఫ్‌నర్సులను సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ ఆదేశించారు. శుక్రవారం సర్వజనాస్పత్రిలోని గైనిక్, తదితర విభాగాలను ఆయన పరిశీలించారు. గైనిక్ విభాగంలో మంచాలను దూరంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆప్తమాలజీ వార్డు వద్దకు వెళ్లారు. సూపరింటెండెంట్ వెంట ఆర్ఎంఓ డాక్టర్ వైవీ రావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

మరికొంతకాలం వీఆర్‌లో సీఐ జాకీర్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా కేంద్రంలోనే తిష్టవేసిన సీఐ జాకీర్‌ని మరికొంతకాలం వీఆర్‌లోనే కొనసాగించనున్నట్లు తెలిసింది. విధి నిర్వహణలో ఆయన చూపిన దూకుడుపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఉన్నతాధికారులు వీఆర్‌లో ఉంచారు. వరుసగా అనంతపురం జిల్లా కేంద్రంలోనే ఎస్ఐ కేడర్ నుంచి సీఐగా పదోన్నతి పొంది, ఇక్కడే ఏళ్లతరబడి కొనసాగుతుండడంపై ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదులపై వారు స్పందించినట్లు తెలిసింది. కాగా ఎస్‌బీ సీఐగా స్థానం చలనం కల్పించిన నేపథ్యంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించేందుకు వెళ్లిన అధికారికి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు కొంత కాలం వీఆర్‌లోనే కొనసాగాలని సూచించినట్లు తెలిసింది. ట్రాక్ రికార్డు పరిశీలన అనంతరం పోస్టింగ్ విషయంపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

నేడు సైకిల్ ర్యాలీ

అనంతపురం క్రైం: నగరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5న పర్యావరణ దినాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం 9 గంటలకు సైక్లోథాన్ పేరిట సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి తెలిపారు. ఈ మేరకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. ర్యాలీని కలెక్టర్ గౌతమి ప్రారంభిస్తారని తెలిపారు.

ఆర్‌డీటీపీ దేవికుమార్ బదిలీ

అనంతపురం క్రైం: ఆర్‌డీటీపీ దేవికుమార్ బదిలీ : అనంతపురం రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ (ఆర్‌డీటీపీ)గా ఉన్న దేవికుమారిని నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్‌గా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆర్‌జే విద్యులత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 1న ఈమెకు తిరుపతికి బదిలీ చేసినట్లు ఉత్తర్వులు వచ్చాయి. తిరిగి శుక్రవారం నెల్లూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందాయి.

ఈఈ రామమోహన్‌రెడ్డి బదిలీ

నగరపాలక సంస్థ ఈఈగా ఉన్న రామమోహన్‌రెడ్డి పబ్లిక్ ఎస్ఈ పీఏగా బదిలీ అయ్యారు. డీఈ నరసింహ కడప నగరపాలక సంస్థకు బదిలీ అయ్యారు. ఏఈగా ఉన్న సాయినాథ్‌బాబును గుత్తికి, నంద్యాలలో ఏఈగా ఉన్న సుబ్రహ్మణ్యం అనంతపురానికి బదిలీ అయ్యారు.

బేల్దారి ఆత్మహత్య


వడ్డే రాజశేఖర్ (ఫైల్)

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం నందమూరినగర్ సమీపంలో నివాసం ఉంటున్న వడ్డే రాజశేఖర్ (30) శుక్రవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు...నందమూరినగర్ సమీపంలో రాజశేఖర్, ఉషా దంపతులు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇద్దరూ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కూతురు సంతానం. రాజశేఖర్ సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలతో ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటాడనే అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు వడ్డే శీన, డీలర్ శీన, వార్డు సభ్యుడు వెంకటేష్, రాము, రామాంజి, అనిల్ తదితరులు వడ్డే రాజశేఖర్ భౌతిక కాయానికి నివాళులర్పించారు.

ఆటో సంఘం రూట్ కమిటీ ఎన్నిక

అనంతపురం అర్బన్: నగరంలోని బళ్లారిరోడ్డు పరిధిలోని సిండికేట్‌నగర్, రాచానపల్లి, కొడిమి రూట్ ఏఐటీయూసీ ఆటో యూనియన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన రూట్ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎ.మల్లికార్జున హాజరయ్యారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవో 21ని ప్రభుత్వం రద్దు చేయాలని అన్నారు. అనంతరం బళ్లారి రూట్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రమేష్ పాల్గొనారు.

నూతన కమిటీ..

బళ్లారి రూట్ అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్, కార్యదర్శిగా ఓబిరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా మురళీని ఎన్నిక చేశారు. అలాగే ఉపాధ్యక్షుడిగా నగర రమేష్, కొడిమి రమేష్, సహాయ కార్యదర్శులుగా మేఘవర్ణ, భాస్కర్, కోశాధికారిగా జాఫర్, కార్యవర్గ సభ్యులుగా రవి, లింగమయ్యను ఎన్నుకున్నారు.

అమ్మవారిని తాకిన సూర్య కిరణాలు

పామిడి: స్థానిక దత్త మహాయోగ పీఠంలో శుక్రవారం హింగూళికాంబ అమ్మవారిని సూర్య కిరణాలు తాకాయి. దీంతో ఆలయ పీఠాధిపతి సురేంద్ర మహరాజ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.